5

## కిటుకు

ప్రొఫెసర్ వాలెస్ భారతదేశానికొచ్చి సంవత్సరం పైగానే అయ్యింది. అతను ఈ దేశంలోని సాంఘిక జీవనం మీద కొంత పరిశోధన చేయాలని పనిగట్టుకుని వచ్చాడు. చాలా యూనివర్శిటీలు అతని ఉపన్యాసాలు విన్నాయి. అతిథిగా గెస్టుహౌసుల్లో మంచి వసతి కల్పించాయి. తెలుగు దేశంలోని ఒక విశ్వవిద్యాలయ అతిథి గృహంలో కూడా వున్నాడు. ప్రతి జిల్లావాడు తమ మాండలికమే అసలైన తెలుగని వాదించుకోవడం అతనికి ఆశ్చర్యం వేసింది.

వాలెస్ నలుమూలలా విరివిగా తిరిగాడు. ప్రజల్ని చూశాడు. వాళ్ళ నమ్మకాల్ని. వాళ్ళ జీవిత స్థాయిని పరిశీలించాడు. ఏర్పరచుకున్న కట్టుబాట్లను, కట్టుకున్న అడ్డుగోడలను గూర్చి ఆలోచించాడు. అన్నిరకాల మనుషుల్తో తిరిగాడు. ప్రముఖుల్ని కల్సుకుని మాట్లాడాడు. పల్లెపాటల్ని రికార్డుచేసుకున్నాడు. వేదాల్లోని లయను అనుభవించినట్టుగా ఆనందించాడు. ముసలివాళ్ళయిపోయిన రంగస్థల నటులతో ఇంటర్వ్యూలు తీసుకున్నాడు. ఇలాంటివి ఎన్ని చేసినా అతనికి సంతృప్తి లేదు. ఏదో తేల్చుకో లేక పోతున్నట్టుగా బాధ పడుతున్నాడు. ఇక్కడి జీవనంలో ఏదో లోపిస్తుంది. ఎన్నో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జవాబులు దొరకడం లేదు.

మాటలు రాకముందే పిల్లలకు జేజే పేరుతో దేవుణ్ణనే వాణ్ణి పరిచయం చేయడం, తెలుగు మాస్టారు సైన్సుమాస్టారు చెప్పే పాఠాలు ఒకదానికొకటి భిన్నంగా వుంటూ, పసిపిల్లల్ని కలవరపెడుతూ వుండడం, కామ సూత్రాలు రాయబడ్డచోట, ఖజురాహో

వెలిసిన గడ్డమీద లైంగిక విజ్ఞానం తప్పు, రహస్యమూ- అన్న భావం ఏర్పడడం, మళ్ళీ వెంటనే పాశ్చాత్యుల్ని చూసి చంకలు కొట్టుకోవడం, ముఖ్యంగా మనుషులు చెప్పేది చేయక పోవడం, చేసేది చెప్పకపోవడం చాలా విభ్రాంతిని కలిగించింది. దేశం నిండా చదువురాని నాయకులను, చదువుకున్న మూర్ఖులను చూసి జుగుప్స కలిగింది.

ఇంత దారిద్ర్యం ఎలా బ్రతకగలుగుతోంది? ఇంత చేతకాని తనం శాంతంగా శాంతిగా ఎలా చలామణి అవుతోంది?.... ఆలో చించగా అతనికి మరో విషయం తోచింది. ఈ దేశంలో పనులు సగం సగం అవుతుంటాయి. సగం సగం పూటలు పస్తులుండడం, సగం సగం టీలు తాగడం, సగం సగం గాలిపీల్చడం, సగం సగమే ధైర్యంగా వుండటం....సగం సగం ఆలోచించడం.... అట్లాగే ఇక్కడి సినిమాల్లో సగం సగం బట్టలిప్పడం....

ప్రొఫెసర్ వెళ్లిపోవడానికి యిక కొద్ది రోజుల వ్యవధిమాత్రమే వుంది. ఇక్కడ పూర్తి చేసుకోవాల్సిన పనులు చాలా ఉండిపోయినాయి. వేరే పని మీద ఒక వారం రోజులు దేశ రాజధాని నగరం వెళ్లాల్సి వచ్చింది. అక్కడ ప్రయత్నించి ఎంతో కష్టంమీద కేబినెట్ మంత్రుల్లో అందరి కంటె ముఖ్యమైన ఓ మంత్రి గారిని కల్సు కున్నాడు. తన గురించి, తన దేశం గురించి క్లుప్తంగా ఇంగ్లీషులో చెప్పుకున్నాడు. తను చేయడానికి వచ్చిన పని గూర్చి చెప్పాడు. తనకు అవసరమైన విషయాల గూర్చి అడిగాడు. కొన్ని విని పూరు కున్నాడు. కొన్ని మాత్రం చర్చించాడు. అడగలేక అడగలేక భయ పడుతూ ఒక ప్రశ్న అడిగాడు.

"ఇలా సగం సగం బతుకుతూ మీ దేశం యింకా ఎన్నేళ్ళు బతుకుతుంది?"

మంత్రి వర్యులకు అది పెద్దజోక్‌లాగా అనిపించింది. పెద్దగా గోలచేస్తూ వడ్ల గిర్నీలాగా నవ్వారు. నవ్వి, తేరుకుని మళ్లీనవ్వుతూ చెబుతున్నారు....

".... మీ కింకా తెలియదేమో మనిషన్న వాడికి కోర్కెలు వ్యసనాలు వుంటాయి. అవి సగం సగం తీర్చి ఓట్లేయించుకుని మా సీట్లు మేం సంపాదిస్తాం. ఆ మిగతా సగం కోర్కెలు మళ్లీ ఎలక్షన్లువొచ్చేదాకా తీరుస్తాం తీరుస్తాం అని వాగ్దానాలు చేస్తుంటాం. అసలే తాగనివాడికి, బాగా తాగినవాడికి బతుకు మీద ఆశ వుండకపోతే వుండకపోవచ్చు. కాని సగం తాగినవాడికి మాత్రం యింకా బతకాలని వుంటుంది. ఈ దేశంలోని వాళ్ళంతా సగంతాగిన వాళ్లే అనుకో! చీకట్లో చెట్లకొమ్మలకు తలక్రిందులుగా వేలాడబడి బతుకుతోంది జనం. ఈ దేశంలోని జనం చీకట్లోగబ్బిలాలు.....గబ్బిలాలో.... సహజంగా ప్రతివాడికి కొంత ఆకర్షణ శక్తి లేదా ఆకర్షింపబడాలనే యుక్తి వుంటుంది. దాంతో మా దేశంలో ప్రతివాడు ఎదుటి వాడితో పొగిడించేసుకోవడం- బిరుదు లిప్పించుకోవడం.... సన్మానాలు చేయించుకోవడం.... ఈ రకంగా ఒకర్నొకరు ఉబ్బగొట్టించుకొని దేశంనిండా అనేకానేక గాలులు నింపి తేలిపోయేటట్టు తేలికగా చేశారు. అందుకే భరత ఖండం బెలూన్‌లాగా సముద్రంలో తేలుతోంది. ఈ దేశాన్ని, ఈ జనాన్ని యిలా మా మాటలమీద నిలబెట్టలేకపోతే ఈపాటికి బంగాళాఖాతంలోనో, అరేబియా మహాసముద్రం లోనో దేశం నిలువునా మునిగిపోయుండేదే..."—మంత్రిగారు బొల బొలా నవ్వుతున్నారు. వాలెస్ తేరుకున్నాడు. మంత్రిగారు ఈ విధంగా సమాధానమిస్తూ వుండివుంటారన్న భావన వాలెస్‌లో తిరుగుతోంది. మంత్రిగారి మాటలు అతను విన్లేదు. అతనేం చెప్పాడో ఏమో...అతని ఆలోచనలు అతన్ని వదల్లేదు. మళ్లీ అడిగితే బావుండదు. ఇన్నిరోజుల అనుభవ సారాంశం కళ్ళముందు తిరిగి అతని ప్రశ్నకు అతనిలోనే

ఏవేవో సమాధానాలు వినిపించాయి. అతని మౌనాన్ని, పరధ్యానాన్ని ఛేదించలేని మంత్రిగారి మాటల్లో ఎంత దేశాభివృద్ధి వుందో, ఎంత గొప్పతనం వుండిందో తనకు తెలియదు.అదేప్రశ్న మళ్లీ అడిగి ఈసారి సరిగ్గా వింటే-మంత్రిగారు సీరియస్ అయిపోయి లేచి నిలబడి నమస్కరించారు, టైం అయిపోయిందన్నట్లు. ప్రొఫెసర్ తడబడ్డాడు. తేరుకుని అనవసరపు నవ్వు అసంతృప్తిగా నవ్వాడు.

"మన దేశాల మధ్య సామాజిక, సాంస్కృతిక సంబంధాలు మరింత పతిష్టంగా కావాలని నా ఆకాంక్ష" అని తన ఇంగ్లీషు సంభాషణ ముగించారు మంత్రిగారు. ప్రొఫెసర్‌కు సరిగా అర్థం కాలేదు 'ఏదో సగం సగం సంబంధాలు.... సగం సగం పతిష్టం' అని అంటున్నట్లు వినిపించింది. ○

పుస్తక ప్రపంచం మాసపత్రిక
జనవరి-ఫిబ్రవరి 1979.